సాక్షి
జనగామ
గురువారం । 30 । మే । 2024



దస్తావేజులతోనే భూ హక్కు..
భూ క్రయవిక్రయాల్లో దస్తావేజులు క్షుణ్ణంగా పరిశీలించడం, సరైన పద్ధతిలో రూపొందించడం అత్యంత కీలకం.
- 8లో ▸



విత్తన ఎంపిక కీలకం
అధిక దిగుబడులకు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం కీలకం. విత్తన ఎంపికపై వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం చేస్తోంది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42^{0} / 36^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతో పాటు వడగాలులు వీస్తాయి. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సాధారణ బోగీల సంఖ్య పెంచాలి



జనగామ: ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బుధవారం పవన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు సాధారణ బోగీల కోసం ప్రధాన మంత్రికి దేశ వ్యాప్తంగా కోటి ఉత్తరాలను పంపించడమే లక్ష్యమన్నారు. గాంధీ మార్గంలో ఉద్యమాన్ని వివిధ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజు దేశ వ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైలు ప్రయాణం చేస్తున్నారన్నారు. ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్యుల పరిస్థితి దయనీయంగా ఆగమ్యగోచరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బండి శంకర్ బాబు, బొద్దుల శ్రీధర్,చంద్రశేఖర్, ఆలేటి శ్రీను, హనుమాన్ల రవి, దండెం రవి , వెంకటరమణ్, సయ్యద్, యాకయ్య, వెంకటేశ్వర్లు, బాలనర్సయ్య, విశ్వనాధుల రాజు, భిక్షపతి, నరేష్ పాల్గొన్నారు.

బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

జఫర్‌గఢ్: సీఎం హామీ మేరకు ఉపాధ్యాయులకు సంబంధించిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, రాష్ట్ర స్టడి సర్కిల్ సభ్యుడు మంగు జయప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ తొమ్మిదేళ్లుగా పదోన్నతులు ఆరేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందన్నారు. అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్స్ అందరినీ రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలు, గురుకులాల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెబ్ కౌన్సిలింగ్ ద్వారా వేసవి సెలవుల్లోనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బాలసదన్‌ను సందర్శించిన జడ్జి



జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని బాల సదన్ (చిల్డ్రన్ హోం)ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత బుధవారం సందర్శించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి అక్కడకు వెళ్లి పిల్లల కష్టసుఖాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. చదువు ఎలా సాగుతుంది, నాణ్యతా ప్రమాణాలతో కూడిన భోజనం అందిస్తున్నారా, పిల్లల ఆరోగ్యం తదితర వాటిపై ఆరా తీశారు. పిల్లలు ప్రతీ రోజు 8 గ్లాసుల మంచి నీటిని తాగాలని సూచించారు. జడ్జి వెంట లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఇట్టబోయిన జ్యోత్స్న, తదితరులు ఉన్నారు.

నిబంధనలు విస్మరిస్తే చర్యలు

దేవరుప్పుల: వ్యవసాయ సాగు రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయాల్లో నిబంధనలు విస్మరిస్తే సదరు యజమానులపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు పరుశరామ్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విత్తనాలు, ఎరువులు స్టాక్ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతుల మేరకు నిర్దేశిత కంపెనీ ఎరువులు మాత్రమే విక్రయించాలని, కాలపరిమితి ముగిసిన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించరాదన్నారు. నకిలీ విత్తనాల ముఠాపై కఠిన చర్యలు తీసుకునేందుకు దుకాణాదారులు తోడ్పాటు అందించాలన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జనగామ: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న రెగ్యులర్, ఆర్టిజన్స్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు) జనగామ సర్కిల్ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎస్ఈ వేణుమాదవ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ భగవాన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీను, శ్రీకాంత్, బత్తిని ఆంజనేయులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ శంకర్‌దాదాలు

నకిలీ బాగోతం..

పట్టణంలోని స్వర్ణకళామందిర్ థియేటర్ ఏరియాలోని జి.రవికుమార్ ఎటువంటి విద్యార్హత లేకుండా 30 ఏళ్లుగా ఎంబీబీఎస్ వైద్యుడి స్థాయిలో ప్రజలకు చికిత్స చేస్తూ మోసం చేస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ బృందం గుర్తించింది. ఎవర్ గ్రీన్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పని చేస్తున్న వైద్యుడు రెండేళ్ల కిందటే వెళ్లిపోయినా.. ఆయన పేరిట ల్యాబ్ నడిపిస్తూ రక్త, మూత్ర, ఇతర పరీక్షలు చేస్తూ దందా చేస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బాలరాజుగౌడ్ అనే వ్యక్తి సత్యం ఎముకల వైద్య నిపుణులు అనే బోర్డుతో బోన్ స్పెషలిస్ట్‌గా వైద్యం చేయడంతో పాటు ప్రిస్క్రిప్షన్ రాయడాన్ని బృందంలోని సభ్యులు గమనించి ఎన్ఎంసీ చట్టం 34–54 ప్రకారం కేసు నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా కజకిస్తాన్‌లో ఎంబీబీఎస్ చదివిన డాక్టర్ నిశాంత్, స్థానిక గాయత్రి ఆస్పత్రిలో పని చేస్తూ.. ఎండీగా చెలామణి అవుతూ బోర్డు పెట్టుకుని ఫిజీషియన్, డయాబెటీస్ స్పెషలిస్ట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. టాస్క్‌ఫోర్స్ టీం తనిఖీలు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న లక్ష్మీ ప్రథమ చికిత్స కేంద్రం పేరిట వైద్యం చేస్తున్న ప్రభాకర్ సెంటర్‌కు తాళం వేసి పరారైనట్లు నిర్ధారించుకుని, దానిపై నిఘా ఉంచారు. ఒక్కరోజు తనిఖీలోనే నకిలీ వైద్యం బాగోతం బట్టబయలు కాగా... ఇంకా ఎన్ని ఉన్నాయనే దానిపై కూపీ లాగుతున్నారు. ఆస్పత్రుల్లో పని చేస్తూ.. కొంతమేర అవగాహన రాగానే ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం... వేలకు వేలు దండుకుంటూ అబార్షన్లు చేస్తూ.. వైద్య వృత్తికి కలంకితం చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. తప్పు చేయని వ్యక్తులు... టాస్క్ ఫోర్స్ బృందం వచ్చిన సమయంలో కేంద్రాలకు తాళాలు వేసుకుని పరారవడం వెనక అసలు నిజాన్ని వైద్య మండలి టీం బయటకు తీయాలని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

అర్హత లేని డాక్టర్లు.. అనవసర వైద్యం

- ఎంబీబీఎస్‌తో పాటు ఎండీగా బోర్డులు
- ఎవర్ గ్రీన్ ఆస్పత్రిలో ప్రెగ్నెన్సీ టెస్ట్ కిట్లు
- విద్యార్హత లేకున్నా.. ఎముకల స్పెషలిస్ట్ వైద్యం
- పలువురిపై కేసు నమోదు
- తెలంగాణ వైద్య మండలి విజిలెన్స్‌కు నివేదికలు


తెలంగాణ వైద్య మండలి బృందం తనిఖీలు



ఎంబీబీఎస్ డాక్టర్.. ఎండీగా బోర్డు పెట్టిన దృశ్యం


ఆస్పత్రిలో పట్టుబడిన ప్రెగ్నెన్సీ కిట్లు

జనగామ: అర్హత లేని వైద్యం చేస్తూ రోగుల పాలిట శాపంగా మారుతున్నారు. తప్పుడు హోదాలతో అమాయక ప్రజలను మోసం చేస్తూ... నిబంధనలకు విరుద్ధంగా ట్రీట్‌మెంట్ చేస్తున్నారు. చిరంజీవి నటించిన శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమాలోలాగా పట్టణంలో కూడా అర్హత లేని వైద్యులు దర్జాగా స్టెతస్కోప్ వేసుకుని ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. స్పెషలిస్టు హోదా లేకున్నా... బోర్డులపై పెద్ద పెద్ద అక్షరాలతో రాతలు రాస్తూ... అర్హత లేని వ్యక్తులు రిపోర్టులు ఇచ్చేస్తున్నారు. కొంత మంది కక్కుర్తి అధికారుల అండదండలతో ప్రైవేట్ వైద్యంలో నకిలీ డాక్టర్లదే హవా కొనసాగుతుంది. నెలనెల 'మామూళ్లు' గానే డూప్లికేట్ వైద్యానికి సహకారం అందిస్తూ... గాలిలో కలిసి పోతున్న అమాయకుల ప్రాణాలకు కారకులవుతున్నారు. గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లు చేస్తూ.. వేలకు వేలు దండుకుంటూ... ప్రెగ్నెన్సీ పరీక్షలు అంగట్లో సరుకులా మార్చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నకిలీ వైద్యం దందాను పెకిలించేందుకు తెలంగాణ వైద్య మండలి బృందం దూకుడు పెంచింది. ఆకస్మిక దాడులతో నకిలీ వైద్యం చేస్తున్న నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తూ... కేసులు సైతం నమోదు చేస్తున్నారు.

అమాయక ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల భరతం పట్టేందుకు రాష్ట్ర వైద్యమండలి టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టారు. ప్రథమ చికిత్స కేంద్రాలు, సర్టిఫై లేని ఆస్పత్రులు, ఎముకల వైద్యశాలలు, డయాగ్నోస్టిక్, ఫిజియోథెరపీ తదితర సెంటర్లను తెలంగాణ వైద్య మండలి టాస్క్ ఫోర్స్ టీం బృందం వరుస దాడులతో నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న హాస్పిటల్స్ బాగోతం ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. వైద్యమండలి టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు డాక్టర్ మాగంటి శేషు మాదవ్, డాక్టర్ వద్ది రాజు రాకేష్, డాక్టర్ వేములపల్లి నరేష్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, డాక్టర్ జలగం విజయ్, డాక్టర్ ఎండీ అన్వర్, డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ షాబాజ్ నేతృత్వంలో ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో తనిఖీలు చేసిన సంగతి తెలిసిందే. తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగు చూశాయి. గుట్టుచప్పుడు కాకుండా గర్భిణీ, హెచ్‌బీ పరీక్షలు, ల్యాబ్‌కు సంబంధించి అర్హత లేని వ్యక్తులచే సర్టిఫికేషన్, తప్పుడు హోదాలు, అనర్హత చాటున స్పెషలిస్టు పేరిట వైద్యం అందిస్తూ తెలంగాణ వైద్యమండలిలో టాస్క్ ఫోర్స్ టీంకు అడ్డంగా దొరికేశారు.



వేషధారణ ద్వారా మోసం చేసిన కేసులో (416), మోసం చేసిన శిక్షలో (417, 419), చీటింగ్ (418), నకిలీ వైద్యంతో నిజమని నమ్మించడం (471), తదితర వాటికి సంబంధించి ఐపీఎస్ సెక్షన్ల పరంగా కేసులు నమోదు చేస్తామని టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు తెలిపారు.

అర్హత లేకున్నా..



వైద్య పట్టా లేకుండా ఎవరూ చికిత్స చేయొద్దు. పారామెడికల్ కోర్సు పూర్తి చేసిన వారు, ప్రాథమిక చికిత్స మాత్రమే చేసి, మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలి. ఎలాంటి అర్హత లేకున్నా, పేరుకు ముందు డాక్టర్ అని బోర్డు తగిలించుకుని ఇంజెక్షన్లు ఇవ్వడం, గ్లూకోస్ ఎక్కించడం విరుద్ధం. క్వాలిఫైడ్ డాక్టర్ రాసిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మెడికల్ దుకాణాల్లో మందులు ఇవ్వాలి. ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ వైద్య మండలికి వచ్చిన ఫిర్యాదులతో పాటు రెగ్యులర్‌గా తనిఖీలు చేస్తుంది. వైద్య పరంగా ఎటువంటి విద్యార్హత లేకుండా, ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. డాక్టర్ చీటి లేకుండా మందులు ఇస్తే, దానిపై ఉన్న బ్యాచ్ నంబర్‌తో పట్టేస్తాం.

- డాక్టర్ జలగం విజయ్, తెలంగాణ వైద్య మండలి టీం సభ్యుడు

ఇంటి నిర్మాణ అనుమతుల్లో జాప్యం వద్దు

- పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలి
- సెంట్రల్ లైటింగ్ మరమ్మతు చేపట్టండి
- యానిమల్ బర్త్ కంట్రోల్‌పై సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న పింకేష్ కుమార్

సాక్షి ఎఫెక్ట్

జనగామ: జనగామ పట్టణంలో ఇంటి నిర్మాణ అనుమతుల్లో జాప్యం చేయరాదని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ కోరారు. ఇటీవల సాక్షిలో ప్రచురిత మైన గాడితప్పిన టౌన్ ప్లానింగ్ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏసీ స్పందించారు. కమిషనర్ చాంబర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కమిషనర్ వెంకటేశ్వర్లు, 2వ వార్డు కౌన్సిలర్ వాంకుడోతు అనిత, తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటి నిర్మాణ అనుమతులకు సంబంధించి 41 ఫైళ్లలో 50 శాతం మేర ఎంక్వైరీ పూర్తి చేసి, నివేదిక అందించాలని టీపీఎస్ ప్రశాంతిని ఆదేశించారు. సేవల విషయంలో మున్సిపల్‌కు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ముఖ్యంగా ఎన్‌క్రోచ్‌మెంట్‌కు సంబంధించి రిపోర్టు అందించాలన్నారు. మెడికల్ లీవ్‌పై వెళ్లిన టీపీఓ శ్రీధర్‌కు ఫోన్ చేసి విధులకు రావాలని అడుగగా, యశోద ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ జరుగుతుందని వివరణ ఇచ్చారు. ఆస్పత్రి రిపోర్టులను తనకు పంపించాలని ఏసీ ఆదేశించారు. పట్టణంలో వీధి బల్బుల కాంట్రాక్టు పూర్తి కావడం, అవి సరిగా వెలగక పోవడంతో చీకటి మయంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏసీ దృష్టికి తీసుకు వచ్చారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో డీఈ, ఇన్‌చార్జ్ ఏఈ, టీపీఓ, ఆర్ఐ, రెగ్యులర్ శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ లేకపోవడంతో పరిపాలన కుంటు బడి పోతుందన్నారు. అలాగే చీటకోడూరు ఫిల్టర్ బెడ్ నుంచి సరఫరా చేసే తాగు నీరు పచ్చకలర్‌లో వస్తుందని, నాణ్యతా ప్రమాణాలతో నీటిని ఫిల్టర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ అనిత చెప్పారు.

రైతులు రశీదు తీసుకోవాలి

- జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్


విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న డీఏఓ

బచ్చన్నపేట: ఎరువుల దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, మందులను కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పకుండా రశీదులను తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శివశంకర్ ఫర్టిలైజర్ షాపులో ఎరువుల, విత్తనాల స్టాక్ వివరాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వరి దుక్కిలో చల్లుకోవడానికి పొలానికి బలమైన జీలుగ విత్తనాలు కూడా అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో లూజుగా ఉన్నవాటిని ప్యాకింగ్ సరిగా లేనికి, ఐఎస్ఐ మార్క్ లేని విత్తనాలను కొనుగోలు చేయకూడదన్నారు. కేవలం జీఈఏపీ అప్రూవల్ ఉన్న ప్యాకెట్లను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎలాంటి విత్తనాలను విత్తకూడదన్నారు. పంటల మెళకువలో ఆయా గ్రామాల ఏఈఓల సలహాలు, సూచనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విద్యాకర్ రెడ్డి, షాపు యజమాని పిన్న సురేందర్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపుపై రైతుల ఆగ్రహం


ఇసుక తరలింపును అడ్డుకున్న రైతులు


రోడ్డుకు అడ్డంగా బండలు పెట్టిన గ్రామస్తులు

దేవరుప్పుల: గొల్లపల్లి వాగు చెక్‌డ్యామ్ నుంచి ఇసుక తరలించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వాగు పరీవాహక రైతులు గొల్లపల్లి వాగు శివారులో ఇసుక తరలింపును అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... ఈ నెల 22న మండలంలోని గొల్లపల్లి వాగు చెక్‌డ్యామ్ ఏరియాలో కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఐ అండ్ క్యాడ్ ఇరిగేషన్ డివిజన్ -5 ఉత్తర్వుల అనుమతుల పేరిట పాలకుర్తి రిజర్వాయర్‌కు ఐదు వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తరలించేందుకు అనుమతులు వచ్చాయి. అదే రోజు చెక్ డ్యామ్ ఏరియా నుంచి ఇసుక తరలించేందుకు జేసీబీ యంత్రాలు రాగా రైతులు అడ్డుకున్న విషయం విధితమే. మళ్లీ బుధవారం కూడా పెద్ద ఎత్తున గొల్లపల్లి వాగు శివారులో జేసీబీలతో ఇసుక తరలిస్తుండగా వాగు పరీవాహక రైతులు చేరుకుని అడ్డుకున్నారు. ఈ విషయమై కాంట్రాక్టర్లు తమకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని వాగ్వాదానికి దిగారు. అయినప్పటికీ రైతులు ససేమిర అన్నారు. వాగులో నుంచి యంత్రాలను వెళ్లగొట్టారు. దారికి అడ్డంగా రాతిబండలు వేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే చుక్కనీరు భూమిలోకి ఇంకదన్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వలాభం చూడకుండా రైతుల గోసను ఆలకించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకవరం నర్సింహ్మారెడ్డి, తీగల దయాకర్, అబ్బయ్య, యాదగిరి, సైదులు, సత్యనారాయణ, భిక్షపతి, కిష్టయ్య, రైతులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కన డీఈఓ

జనగామ: జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్తీ యూపీఎస్, ఉర్దూ మీడియం యూపీఎస్ పాఠశాలలు, జనగామ మండలం శామీర్‌పేట, ఎల్లంల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక, ఉన్నత బాణాపురం పీఎస్ పాఠశాలల్లో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో విద్యుత్ బల్బులు, ఫ్యాన్లు, ఇతర మరమ్మతు పనులను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. తాగు నీటి సిస్టర్న్, వాష్ ఏరియా ప్లాట్ ఫాం, ట్యాప్‌లను తనిఖీ చేసి, నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 291 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 93 పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు సుందరీకరణ పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట డీఈఓ రాము, డీఆర్డీఓ మొగులప్ప తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

రఘునాథపల్లి: ధాన్యం కొనుగోళ్లు రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని అశ్వరావుపల్లి, వెల్ది గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం తరలింపు, తేమ శాతం తదితర వివరాలను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 195 కొనుగోలు కేంద్రాలకు గాను 185 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయన్నారు. ఇప్పటి వరకు 24,559 మంది రైతుల నుంచి 1,25,163,360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, 23,413 మంది రైతులకు రూ. 256.18 కోట్లు చెల్లించామన్నారు. కలెక్టర్ వెంట డీసీఎస్ఓ రోజారాణి, డీఎం, డీఆర్డీఓ మొగులప్ప, డీఎం సీఎస్ ప్రసాద్, తహసీల్దార్ పురం యుగేందర్, డీటీ సీఎస్ శ్రీనివాస్, సీసీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలి

రఘునాథపల్లి: రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన వీర వనిత పుట్టిన గడ్డ జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కోమల్లలో ఆయన రజక సంఘం నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి ఐలమ్మ వర్ధంతిని అధికారికంగా జరపడంతో పాటు జిల్లాకు పేరు పెట్టాలన్నారు. రజకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఐలయ్య, శ్రీనివాస్, భిక్షపతి, రామ్మూర్తి, సంపత్, వెంకటనర్సు, చంద్రయ్య, సత్యనారాయణ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు నేతలపై 'ట్యాపింగ్' పడగ!

సెలెక్టెడ్ పొలిటికల్ లీడర్ల సంభాషణలు విన్నారు..

- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల కట్టడే లక్ష్యం
- ఫోన్ ట్యాపింగ్‌తోనే డబ్బు, మద్యం గుట్టు రట్టు
- జేఏసీ, విద్యార్థి సంఘాల నేతల ఫోన్లపైనా నిఘా
- భుజంగరావు, తిరుపతన్న నేతృత్వం.. ప్రణీత్‌రావు, మరికొందరు పాత్రధారులు
- కడియం శ్రీహరి, తాడికొండ రాజయ్య వివాదంపై క్లారిటీ
- ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి ప్రభాకర్‌రావు నీరుకుళ్ల వాసి



సాక్షిప్రతినిధి, వరంగల్ : రోజుకో మలుపు తిరుగుతూ కొత్త అంశాలను తెరమీదకు తెస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుల వాంగ్మూలాలు గందరగోళం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కీలక సూత్రధారిగా భావిస్తున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఉమ్మడి వరంగల్ జిల్లా నీరుకుల్లకు చెందిన వ్యక్తి కాగా.. ఈ ప్రాంతం నేతలు కూడా ట్యాపింగ్ నుంచి తప్పించుకోలేకపోయారు. జేఎస్ భూపాలపల్లి అదనపు ఎస్పీగా ఉన్న భుజంగరావు, మరో అదనపు ఎస్పీ తిరుపతన్న నేతృత్వంలో ఏసీపీ ప్రణీత్‌రావు ఆధ్వర్యాన బృందాలు ఉమ్మడి వరంగల్‌పై దృష్టి పెట్టడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం హాట్‌టాపిక్ మారింది.

రిమాండ్ రిపోర్టులో విస్తుపోయే వాస్తవాలు..

ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశాలతోనే తాము ట్యాపింగ్, దాడులు చేసినట్లు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా వారు చెప్పిన వాస్తవాలు, రిమాండ్ రిపోర్టులో అంశాలు ఉమ్మడి వరంగల్ రాజకీయవర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. హుజూరాబాద్ ఉప ఎన్నికతోపాటు 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కీలకంగా పనిచేసినట్లు అంగీకరించారు. మరో మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావు కూడా అంశాల వారీగా కొన్నింట్లో సలహాలు, సూచనలు చేసినట్లు వారు తమ వాంగ్మూలంలో పేర్కొన్నారు. హుజూరాబాద్ ఉప ఎన్నిక సందర్భంగా ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో పాటు కమలాపూర్ ప్రాంతానికి చెందిన కొందరు కాంగ్రెస్, బీజేపీ నాయకుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ఆ సమయంలో వరంగల్ కేంద్రంగా ఇద్దరు సీఐలతో కలిసి పనిచేసిన ఏసీపీ ప్రణీత్‌రావు బృందం ఇచ్చిన సమాచారం మేరకు డబ్బు, మద్యం రవాణాకు అడ్డుకట్ట వేయగలిగామని తెలిపారు. అలాగే 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో నర్సంపేట, జనగామ ప్రాంతాల్లో సుమారు రూ.2.18 కోట్ల నగదు పట్టుకున్న సంఘటనలతోపాటు పాలకుర్తి అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి నుంచి రూ.90 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ తిరుపతన్న తన వాంగ్మూలంలో వెల్లడించినట్లు రిమాండ్ రిపోర్టు చెబుతోంది. ములుగు, భూపాలపల్లి, పాలకుర్తి తదితర ప్రాంతాల్లో కొందరి ఫోన్‌ల ట్యాపింగ్‌తో మద్యం రవాణా గుట్టు విప్పినట్లు పేర్కొన్నారు.

'స్టేషన్' వివాదంపై స్పష్టత

ప్రముఖ రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు ఇందులో భాగమై ఉన్నారని, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఈ ఆపరేషన్‌కు ఇన్‌చార్జ్‌గా ఉన్నారని అంగీకరించిన మాజీ పోలీసు అధికారి రాధాకిషన్‌రావు.. పలువురు ముఖ్యనేతలు, అధికారుల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు ఒప్పుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి వరంగల్‌లో 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికార, విపక్ష నేతల వైఖరిపై నిఘా వేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చాలన్న నిర్ణయం వివాదం కావడంపైనా ట్యాపింగ్ వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు వెల్లడైంది. మాజీ మంత్రులు కడియం శ్రీహరి, తాటికొండ రాజయ్య మధ్య గ్రూపు తగాదాలు, పరస్పర ఆరోపణలు పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. ఈ నేపథ్యంలో ఇద్దరు నేతలు, వీరి వర్గాలకు చెందిన ముఖ్య నేతల ఫోన్ సంభాషణల తీరును పరిశీలించి ఇచ్చిన నివేదిక మేరకు కడియం శ్రీహరికి 'బీ'ఫామ్ ఇచ్చి వివాదానికి తెర వేసినట్లు చెబుతున్నారు. ఉమ్మడి వరంగల్‌లో మాజీ పోలీసు అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పర్యటన, సభలు, సమావేశాలు, సంభాషణలపైన ఆరా తీసినట్లు తేలిందని 'సిట్' రిపోర్టులో పేర్కొంది.

ఇలా ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అంశాలు ఒక్కొక్కటిగా రిమాండ్ రిపోర్టు ద్వారా వెల్లడవుతుండటంతో అందరూ విస్తుపోతున్నారు.

నేల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలి

హన్మకొండ : నేల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు పచ్చి రొట్ట ఎరువును వాడుతూ ప్రతి సంవత్సరం భూసార పరీక్ష చేయించుకోవాలని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో 'దీర్ఘకాలిక పంట ఉత్పాదన కోసం నేల ఆరోగ్య పరిరక్షణ' అనే అంశంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పండించడానికి నేల సహజసిద్ధ వనరని, నేల మొక్కకు కావాల్సిన పోషకాలు, నీరు అందిస్తుందన్నారు. ఈ క్రమంలో నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే కావాల్సిన పంట దిగుబడులు సాధించుకోవాలన్నారు. నాబార్డు డీడీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిక్షణ నెలకు ఒక్కటి చొప్పున 2024 మే నుంచి 2025 ఫిబ్రవరి వరకు జరుగుతుందన్నారు. వరంగల్ డాట్ సెంటర్ కోఆర్డినేటర్ దిలీప్ కుమార్, వ్యవసాయ అధికారి నగేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● నిందితుడిపై కేసు నమోదు

మరిపెడ రూరల్: మతిస్థిమితం లేని బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ఓ తండాలో చోటు చేసుకోగా, రెండు రోజులు ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై తాహేర్‌బాబా కథనం ప్రకారం.. ఈ నెల 27న మండలంలోని ఓ తండాకు చెందిన బాలికపై అదే తండాకు చెందిన గుగులోత్ గోపి లైంగికదాడికి యత్నించాడు. సదరు బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా తాత, నానమ్మ వద్ద ఆడుకుంటుంది. ఈ క్రమంలో బాలికకు చాక్లెట్లు, బిస్కెట్ల ఆశ చూపించి గోపి తన ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నిస్తుండగా బాలిక కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు ఘటనాస్థలికి చేరుకోవడంతో నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై అత్యాచారయత్నం, పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తాహేర్‌బాబా తెలిపారు.

'నా భార్యను అప్పగించాలి'

● భర్త వేడుకోలు

కురవి: మూడేళ్లుగా ప్రేమించుకున్నాం.. పెళ్లి చేసుకున్నాం.. పెద్దమనుషుల మాటలు విని పోలీసు స్టేషన్‌కు వస్తే బెదిరించి తన భార్యను ఎత్తుకెళ్లారని, 'నా భార్యను నాకు అప్పగించాలని' భర్త బానోత్ జగన్ బుధవారం మండల కేంద్రంలో వేడుకున్నాడు. మండలంలోని కంచర్లగూడెం తండాకు చెందిన జగన్ కథనం ప్రకారం.. కురవి మండలం బలపాల శివారు లింగ్యా తండాకు చెందిన గుగులోత్ సరిత, జగన్ మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనెల 19వ తేదీన హైదరాబాద్‌లో పెళ్లి చేసుకున్నారు. వారం క్రితం సరిత బంధువులు కురవి పోలీస్ స్టేషన్‌లో కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేయగా పోలీసులు తీసుకొచ్చారు. అనంతరం ఇద్దరూ మేజర్లు కావడంతో స్టేషన్ నుంచి పంపించి వేశారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం పెద్దమనుషులు మాట్లాడుకుందామని కురవికి రావాలని చెప్పడంతో పీఎస్ వద్దకు వచ్చారు. ఈ సమయంలో తన భార్యను తీసుకెళ్లారని జగన్ వివరించారు. ఈ ఘటనపై ఈనెల 27వ తేదీన పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండు రోజుల నుంచి పీఎస్ చుట్టూ తిరుగుతున్నానన్నారు. ఈ విషయమై ఎస్సై గోపిని వివరణ కోరగా సరితను తీసుకెళ్లిన విషయంపై విచారణ చేస్తున్నామన్నారు.

దస్తావేజులతోనే భూ హక్కు..

క్రయవిక్రయాల్లో ఈ పత్రాలే కీలకం
- లేనిపక్షంలో చెల్లుబాటు కావు
- ప్రభుత్వానికి ఆదాయ వనరుగా నిలుస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ
- దస్తావేజుల తయారీతో నిరుద్యోగులకు ఉపాధి



కాజీపేట అర్బన్ :'మనిషి జీవితం శాశ్వతం కాదు.. భూదస్తావేజులు(ల్యాండ్ డీడ్స్) మాత్రం శాశ్వతం' అనే కొటేషన్ (సూక్తులు)లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దర్శనమిస్తుంటాయి. అవును.. ఆ కొటేషన్ నిజమేనని అనాలి. ఎందుకంటే మాట కంటే.. ధ్రువపత్రంపై రాసుకున్న అక్షరాలనే న్యాయస్థానం నమ్ముతుంది. ధ్రువపత్రమే సాక్ష్యాధారం అవుతుంది. అందుకే దస్తావేజుల ద్వారానే భూ క్రయవిక్రయాలు సాగుతాయి. ఈ పత్రాలు రూపొందించే క్రమంలో ఏమాత్రం ఏమరపాటు చేసిన సమస్యలు ఉత్పన్నమవుతాయి. అందుకే భూక్రయవిక్రయాల్లో దస్తావేజులు క్షుణ్ణంగా పరిశీలించడం, సరైన పద్ధతిలో రూపొందించడం అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో మార్కెట్ విలువ ఆధారంగా స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుతో రిజిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తోంది.

భూ దస్తావేజుల రకాలు ఇలా..

సేల్ డీడ్(విక్రయ దస్తావేజు)..

తమ భూమిని ఇతరులకు విక్రయించిన తరుణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ నిమిత్తం సేల్ డీడ్(విక్రయ దస్తావేజు) ద్వారా రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. ఇందుకు గాను సేల్ డీడ్‌కు 7. 5 శాతం స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలాన్ రూపంలో చెల్లించాలి.

గిఫ్ట్ డీడ్(బహుమతి దస్తావేజు)..

ఒక వ్యక్తి తన భూమి లేదా ఆస్తిని తనకు నచ్చిన వారికి బహుమతిగా ఇచ్చేందుకు గాను గిఫ్ట్ డీడ్ ద్వారా బదలాయింపు చేస్తారు. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గిఫ్ట్ డీడ్‌కు 3 శాతం రుసుం స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా కారణంతో తనకు నచ్చిన వారికి ఇచ్చిన బహుమతి తిరిగి తీసుకునే హక్కు దాతకు ఉంటుంది.

పార్టీషన్ డీడ్ (పంపకాల దస్తావేజు)..

తన తండ్రి లేదా వారసత్వంగా వస్తున్న ఆస్తిని వారసులు పంచుకునేందుకు గాను పార్టీషన్ డీడ్‌ను ఉపయోగిస్తారు. పార్టీషన్ డీడ్ ద్వారా తమ ఆస్తిని పంచుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు గాను 0.5 స్టాంప్ డ్యూటీ రూ. 2వేలు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. వారసులు కాకుండా ఇతరులకు ఆస్తిలో పంపకాలు జరిపేందుకు గాను 2.5 రుసుం రిజిస్ట్రేషన్ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది.

రెక్టిఫికేషన్ డీడ్(తప్పుల సవరణ దస్తావేజు)..

భూ దస్తావేజుల్లో ఏమైనా తప్పులు దొర్లినప్పుడు వాటిని సరిచేసుకునేందుకు గాను రెక్టిఫికేషన్ డీడ్ తోడ్పడుతుంది. రూ. 2 వేల రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు రూ. 100 స్టాంప్ డ్యూటీగా చెల్లించాలి.

జీపీఏ లేదా ఎస్‌పీఏ డీడ్ (భూహక్కు లేదా పవర్ దస్తావేజు)..

సాధారణంగా తమ ఆస్తిపై తమకు నచ్చిన వారికి హక్కును కల్పించేందుకు గాను జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) దస్తావేజు ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తారు. జీపీఏ చేసిన వ్యక్తి జీవించి ఉన్నంత కాలం జీపీఏ వర్తిస్తుంది. తదనంతరం వర్తించదు. తమకు నచ్చిన వారికి తమ ఆస్తిపై హక్కు కల్పించేందుకు గాను ఎస్‌పీఏ(స్పెషల్ పవర్ ఆఫ్ అటార్నీ) దస్తావేజు ద్వారా హక్కు కల్పిస్తారు. కాగా, ఎస్‌పీఏ కేవలం 150 రోజుల కాలపరిమితితో మాత్రమే హక్కు కల్పిస్తుంది. ఇందుకు గాను రిజిస్ట్రేషన్ శాఖకు జీపీఏ, ఎస్‌పీఏకు గాను 1 శాతం స్టాంప్ డ్యూటీ, 0.5 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి.

ఆదాయ వనరు..

రిజిస్ట్రేషన్ శాఖ.. రాష్ట్ర ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తోంది. దస్తావేజుల రిజిస్ట్రేషన్ ద్వారా రుసుం ఖజానాకు చేరుతుంది. దీంతో ప్రభుత్వం అన్ని శాఖల కంటే రిజిస్ట్రేషన్ శాఖపై ఎక్కువ మక్కువ కనబరుస్తుంది.

దస్తావేజుల తయారీతో ఉపాధి..

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టు నిరుద్యోగ యువత ఉపాధి నిమిత్తం డాక్యుమెంట్ రైటర్లుగా కొనసాగుతున్నారు. భూక్రయవిక్రయదారులకు దస్తావేజులు రూపొందిస్తూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ఉపాధి పొందుతున్నారు.

లే అవుట్‌తోనే భూమికి భద్రత



భూమి కొనుగోలు అంశంలో జాగ్రత్తలు తప్పకుండా పాటించాలి. లేఅవుట్ ప్లాట్లనే కొనుగోలు చేయాలి, తద్వారా భూమికి భద్రత ఉంటుంది. భూమి కొనుగోలు చేసేటప్పుడు దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలించాలి, స్వయంగా దస్తావేజులు రూపొందించుకునేందుకు telangana.registration.gov.in అను వెబ్‌సైట్‌ను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో భూమి మార్కెట్ విలువ ఆధారంగా చలాన్ చెల్లించి, రూపొందించుకున్న దస్తావేజులతో నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తాం.

-రాజు, సబ్ రిజిస్ట్రార్, వరంగల్ ఆర్‌ఓ

మరో పోరాటానికి సిద్ధం కావాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: రాష్ట్రంలో రిజర్వేషన్ల పెంపు సాధనకు ఎస్సీ, ఎస్టీ, బీసీలు మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా 80శాతం దాటిందన్నారు. ఈ మేరకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు వర్గాలను మోసం చేస్తుందని విమర్శించారు. చేవెళ్ల సభలో ఎస్సీలకు 18, ఎస్టీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. బీసీల కులగణన పేరుతో కామారెడ్డిలో డిక్లరేషన్ చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలవుతున్నా రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు అడుగులు వేయడం లేదని ప్రశ్నించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సిద్ధ రామయ్యతో చేయించిన డిక్లరేషన్ ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. జూన్ 11వ తేదీ లోపు రిజర్వేషన్ల పెంపుపై నిర్ణయం తీసుకోకపోతే యుద్ధం ప్రారంభిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మేధావులు, సంఘాలు, రాజకీయ నాయకులను సమీకరిస్తామని, రిజర్వేషన్ల పెంపు సాధనకు పోరాటం చేస్తామన్నారు. ఈ పోరాటానికి ఎమ్మార్పీఎస్ సమన్వయకర్తగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వేల్పుల సూరన్న కాపు, మంద కుమార్ మాదిగ, పుట్ట రవి, బండారి సురేందర్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, జన్ను దినేష్, మంద రాజు, గంగారాపు శ్రీనివాస్, అంకిళ్ల రాజు పాల్గొన్నారు.

విత్తన ఎంపిక కీలకం



భీమదేవరపల్లి మండలం రత్నగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులు

- వ్యవసాయ శాఖ విస్తృత ప్రచారం
- రైతు వేదికలు, రచ్చబండ వద్ద అవగాహన

హన్మకొండ: అధిక దిగుబడులకు విత్తన ఎంపిక కూడా ముఖ్యమే. నాణ్యమైన, శ్రేష్టమైన విత్తనాన్ని ఎంచుకోవడం కీలకం. వానాకాలం పంటల సాగుకు విత్తనాల ఎంపిక, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. గతానికి భిన్నంగా ఈసారి వినూత్నంగా అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ప్రత్యేక సమావేశాలతో పాటు ఎక్కడ పది మంది ఉంటే అక్కడ, చివరకు రచ్చబండల వద్ద కూడా వ్యవసాయ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు అవగాహన కల్పిస్తున్నారు. భౌగోళిక, వాతావరణ, శీతోష్ణస్థితి పరిస్థితులను అనుసరించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, వ్యవసాయ రంగంలో అనుభవమున్న రైతుల సలహాలు, సూచనలు తీసుకోవాలి. విత్తన ఎంపికలో జాగ్రత్తలు తీసుకోకపోతే మొలకెత్తకపోవడం, ఎక్కువగా తెగుళ్లు, చీడపీడలు ఆశించడం.. తద్వారా పంటనష్టం జరుగుతుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయొద్దు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్యాక్ చేసిన, లేబుల్ వేసిన విత్తనాలను మాత్రమే కొనాలి. గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయొద్దు. విత్తనాలు కొనుగోలు చేసే ముందు గ్రామం, మండలం, జిల్లాలో అధీకృత డీలర్ల వివరాలు తెలుసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత తీసుకున్న రశీదు మీద విత్తన కంపెనీ పేరు, విత్తనం రకం, బ్యాచ్, లాట్ నంబర్, ధర వివరాలు చూసుకోవాలి. విత్తన ప్యాకెట్‌లపై తయారీ తేదీ, పత్తి విత్తనాలైతే జీఈఏసీ నంబర్ చూసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే పంట నష్టం జరిగినప్పుడు వ్యవసాయ అధికారులను సంప్రదించి నష్టపరిహారం పొందొచ్చు. పక్క జిల్లాలు, రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి నకిలీ విత్తనాలు విడిగా అమ్మితే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. తక్కువ ధరకు లభిస్తున్నాయని కొనుగోలు చేసి నష్టపోవద్దు. హైబ్రీడ్ విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యత లేబుల్ మీద ఉన్నాయో లేదో చూడాలి. విత్తనాన్ని కొనుగోలు చేసిన తర్వాత ఇంటి వద్దే మొలక శాతాన్ని పరీక్షించుకున్న తర్వాత సంతృప్తికరంగా ఉంటేనే పొలంలో విత్తుకోవాలి. విత్తనంలో మొలకశాతం తక్కువగా ఉంటే కొనుగోలు చేసిన దుకాణదారుడి దగ్గరకు తీసుకువెళ్లి పరిస్థితిని వివరించి వేరే విత్తనం తీసుకోవాలి. విత్తన లోపాన్ని వివరించిన తర్వాత వ్యాపారి సరైన రీతిలో స్పందించకపోతే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలి. తద్వారా పరిహారం పొందొచ్చు. పంటకు నష్టం జరిగితే రైతుకు రశీదే కీలక ఆధారం. కాబట్టి పంట కాలం పూర్తయ్యే వరకు కొనుగోలు చేసిన రశీదు జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.

వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలి



రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి. దళారులను నమ్మి మోసపోవద్దు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న దుకాణాల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి. గ్రామాల్లోకి గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి విత్తనాలు అమ్మితే కొనవద్దు. అలాంటి వారిపై వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలి.

-రవీందర్ సింగ్, హనుమకొండ డీఏఓ

వనదేవతల స్థలం ఆక్రమించొద్దు

- మేడారం పూజారుల డిమాండ్
- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన
- మంత్రి హామీతో ధర్నా విరమణ



ధర్నా చేస్తున్న పూజారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: భద్రకాళి దేవస్థాన అధికారులు.. మేడారం సమ్మక్క, సారలమ్మకు కేటాయించిన స్థలం ఆక్రమించుకునే ప్రయత్నం విరమించుకోవాలని, సమ్మక్క- సారలమ్మ ధార్మిక భవనంగా నామకరణం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మేడారంలో వనదేవతల పూజారులు ధర్నా చేశారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు చందా రఘుపతి, కొక్కెర రమేశ్ మాట్లాడుతూ 1993లో అప్పటి మంత్రి జగన్నాయక్ మేడారం ఈఓ కార్యాలయం భవన నిర్మాణం కోసం వరంగల్ సెంట్రల్ జైల్ సమీపంలో వెయ్యి గజాల స్థలం అమ్మవార్లకు కేటాయించారన్నారు. సుమారు 30 ఏళ్ల నుంచి ఆ స్థలం కాపాడుకున్నామన్నారు. ఇటీవల ఆ స్థలంలో ధార్మిక భవనం నిర్మించారని, ఆ భవనంలో మేడారం ఈఓ కార్యాలయం, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఇంజనీరింగ్ కార్యాలయాలు కొనసాగుతున్నాయన్నారు. వేద పాఠశాల ఏర్పాటు చేయడంతోపాటు సదరు స్థలాన్ని భద్రకాళి దేవస్థానం లాక్కునేందుకు ఈ కార్యాలయాలను ఖాళీ చేయాలని అధికారులపై ఒత్తిడి చేయిస్తున్నారన్నారు. ఈ విషయంపై ఇటీవల దేవాదాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడినా ఆ అధికారి నుంచి ఎలాంటి హామీ రాలేదన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో నిరసన చేపడుతున్నామన్నారు.

ప్రత్యేక జీఓ తీసుకువస్తాం: మంత్రి సీతక్క

మేడారంలో పూజారులు చేపట్టిన ధర్నా వద్దకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క చేరుకున్నారు. పూజారులతో మాట్లాడారు. ఈవిషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆధారాల చూపించి భవనానికి సమ్మక్క, సారలమ్మ ధార్మిక భవనంగా నామకరణం చేయించి మేడారం కార్య నిర్వాహణాధికారి పరిధిలోకి వచ్చేలా ప్రత్యేక జీఓ తీసుకువస్తానని హామీ ఇచ్చారు. దీంతో పూజారులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో పూజారులు మునీందర్, కాక సారయ్య, సిద్ధబోయిన స్వామి, అనిల్, కాక వెంకటేశ్వర్లు, భుజంగారావు, అమృత, దబ్బగట్ల గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన ప్రవేశ మార్గం గేట్‌కు తాళం

ధర్నా సందర్భంగా పూజారులు.. అమ్మవార్ల దర్శనానికి వెళ్లే ప్రధాన ప్రవేశ మార్గం గేట్‌కు తాళం వేశారు. దీంతో భక్తులను పోలీసు క్యాంపు దారి నుంచి అమ్మవార్ల దర్శనానికి అనుమతి ఇచ్చారు.

పీఆర్‌సీ వర్తింపజేయాలి

● కేయూ ఎన్‌జీఓ వినతి



ఇన్‌చార్జ్ వీసీకి వినతిపత్రం ఇస్తున్న కేయూ ఎన్‌జీవో, క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ బాధ్యులు

కేయూ క్యాంపస్: సర్వే చేయించిన అనంతరం కాకతీయ యూనివర్సిటీకి ప్రహరీ నిర్మాణం చేపడతామని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ అన్నారు. ఈ మేరకు బుధవారం పరిపాలన భవనంలో ఉద్యోగులు, విద్యార్థులతో సెనేట్‌హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయా ఉద్యోగ, విద్యార్థి సంఘాల బాధ్యులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని తెలిపారు. కేయూలోని 90 మంది ఉద్యోగులకు పీఆర్‌సీ వర్తింపజేయాలని ఎన్‌జీఓ జనరల్ సెక్రటరీ వల్లాల తిరుపతి కోరగా సమస్య త్వరలోనే పరిష్కరిస్తానని కరుణ హామీ ఇచ్చారు. సూపరింటెండెంట్ పదోన్నతులకు ఒకే చెప్పారు. అలాగే, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు ఇన్‌చార్జ్ వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లారు. పీహెచ్‌డీ కోర్సుల ఫీజులు తగ్గించాలని, అన్ని విభాగాల తరగతుల గదులను డిజిటలైజేషన్ చేయాలని, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆ కళాశాల నుంచి హాస్టల్ వరకు బస్సు సదుపాయం కల్పించాలనే తదితర సమస్యలు విన్నవించారు. స్పందించిన ఇన్‌చార్జ్ వీసీ.. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీలో పారిశుద్ధ్య లోపంపై కేయూ అభివృద్ధి అధికారి వాసుదేవరెడ్డిని పిలిపించారు. పారిశుద్ధ్య నిర్వహణ, లైబ్రరీ, హాస్టళ్లలో మంచి నీటి సదుపాయంపై పూర్తిస్థాయిలో నివేదిక అందజేయాలని ఆదేశించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న భీముడు

తొర్రూరు రూరల్: తొర్రూరు ఎక్సైజ్ అధికారులు తనను వేధింపులకు గురి చేశారని ఆరోపిస్తూ మండలంలోని కపూర్య తండాకు చెందిన భీముడు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. తొర్రూరు ఎక్సైజ్ అధికారులు బుధవారం తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. ఈ సమయంలో అదే తండాకు చెందిన భీముడుని గతంలో తనపై గుడుంబా విక్రయించిన కేసు ఉందని పోలీసుస్టేషన్ రావాలని వేధింపులకు గురి చేశారు. ఈ ఘటనపై మనస్తాపం చెందిన భీముడు ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట భీముడి బంధువులు, తండావాసులతోపాటు జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ ఆందోళన చేపట్టారు. సమాచారం తెలుసుకున్న సివిల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు. కాగా, భీముడిని వేధింపులకు గురి చేశామని ఆరోపించడం సరికాదని తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై తిరుపతి అన్నారు. కపూర్య తండాలో గుడుంబా స్థావరాలపై దాడులు చేశామని, ఈ దాడుల్లో భీముడికి చెందిన గుడుంబా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో పోలీసుస్టేషన్ రమ్మన్నామన్నారు. కావాలనే ఎక్సైజ్ అధికారులను బ్లాక్ మెయిల్ చేసేలా తండావాసులు వ్యవహరించారన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలి మృతి



కాశమ్మ(ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధురాలి మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని సముద్రాలలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాడూరి కాశమ్మ(73) రోజూ మాదిరిగానే మంగళవారం తన ఇంటి ఎదుట కూర్చుంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కట్ల యాదగిరికి చెందిన ట్రాక్టర్‌ను అతడి కుమారుడు రాజ్‌కుమార్ రివర్స్ తీసేందుకు స్టార్ట్ చేశాడు. నిర్లక్ష్యంగా వెనుకకు తీస్తుండగా ట్రాక్టర్.. కాశమ్మను ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను తన అల్లుడు వెంటనే 108లో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతిచెందింది. ఈ ఘటనపై మృతురాలి అల్లుడు పరశురాములు ఫిర్యాదు మేరకు రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ముస్క రాజు బుధవారం తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంతలోకాలకు

- అదుపుతప్పి ఆటో బోల్తా.. ఇద్దరు మృతి
- ముగ్గురికి గాయాలు
- ఊరుగొండ వద్ద ఘటన




ఘటనా స్థలిలో లక్ష్మి మృతదేహం

దామెర: మేడారం సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వెళ్తున్న క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు చెందిన కల్లూరి రాణి, తన తల్లి జనరాసుపల్లి లక్ష్మి, బంధువులు చెన్నమ్మ, ఊరడి అనంతమ్మ మంగళవారం రాత్రి సాధుల ప్రభుకు చెందిన ఆటోలో మేడారం బయలుదేరారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున ఊరుగొండ శివారు పెట్రోల్‌బంక్ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో లక్ష్మి(68)కి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రాణి, చెన్నమ్మ, అనంతమ్మ, ఆటో డ్రైవర్ ప్రభుకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు 108లో ఎంజీఎం తరలించారు. వారిలో చెన్నమ్మ (78) చికిత్స పొందుతూ చనిపోయింది. క్షతగాత్రురాలు రాణి ఫిర్యాదు మేరకు అజాగ్రత్త.. అతివేగంతో ఆటో నడిపిన ప్రభుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు. కాగా, ఎంజీఎంలో చికిత్స పొందుతున్న వారిని ఎస్సై అశోక్ కలిసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముగ్గురు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరంగల్ డాక్టర్ కాలనీ సమీపంలోని సుర్జీత్‌నగర్‌లో ఒకరు, అయోధ్యపురం రైల్వేగేట్ సమీపంలో మరొకరు, కాటారం మండల కేంద్రంలో ఇంకొకరు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



నరేశ్ (ఫైల్)

రామన్నపేట : రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో శస్త్ర చికిత్స చేసినా ఫలితం లేకపోవంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వరంగల్ డాక్టర్ కాలనీ సమీపంలోని సుర్జీత్‌నగర్‌కు చెందిన నరేశ్(34) ఆరునెలల క్రితం భార్య నుంచి విడాకులు పొందాడు. అనంతరం తల్లి లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. శస్త్ర చికిత్స చేసిన ఫలితం లేకపోవడంతో మనస్తాపానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 23వ తేదీన తల్లి.. బంధువుల ఇంటికి వెళ్లింది. 27వ తేదీన సాయంత్రం ఇంట్లోకి వెళ్లిన నరేశ్ బయటకు రాలేదు. ఈ క్రమంలో ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తల్లికి సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి బుధవారం ఉదయం తలుపులు తీయగా నరేశ్ ఉరేసుకుని కనిపించాడు. ఈ ఘటనపై తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు.

రైలు కిందపడి మరో యువకుడు..

కాజీపేట రూరల్ : కాజీపేట – పెండ్యాల రైల్వే స్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని సుమారు 35 ఏళ్ల వయసు గల యువకుడు అయోధ్యపురం రైల్వేగేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి ఎడమ చేతిపై ఏఏ అని, కుడి చేతికి రబ్బర్ బ్యాండ్ ఉందని తెలిపారు. మృతుడు నలుపు రంగుతో 5.6 అడుగుల ఎత్తు, గోధుమ రంగు ప్యాంట్, తెలుపు రంగు షర్ట్ ధరించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ తెలిపారు.



గుర్తుతెలియని యువకుడి మృతదేహం

కాటారంలో ఇంకో యువకుడు..

కాటారం: అనారోగ్య కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు .. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం కాటారంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రంలోని బొమ్మనగూడేనికి చెందిన బండం రమేశ్(38) నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. రూ. నాలుగు లక్షలు ఖర్చు చేసి మూడుసార్లు మోకాళ్ల భాగంలో ఆపరేషన్, ఒక్కసారి కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు. ఇటీవల మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో డాక్టర్ల వద్దకు వెళ్లగా మరోసారి ఆపరేషన్ చేయాలని సూచించారు. రమేశ్ భార్య జ్యోతి నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లగా ఒంటరిగా ఉన్న రమేశ్ తీవ్ర మనోవేదనకు గురై మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం గమనించిన స్థానికులు భార్య, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం రమేశ్ మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు రిశ్వంత్ ఉన్నాడు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.